క్లుప్తంగా

నేడు లక్ష్మీపురంలో గడప గడపకూ..

దేవరపల్లి: గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మండలంలోని లక్ష్మీపురంలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కూడిపూడి సతీష్ తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, సొసైటీల అధ్యక్షులు, పార్టీ నాయకులు, అధికారులు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు, హాజరు కావాలని ఆయన కోరారు.

చీపురుగూడెం మాజీ సర్పంచ్ 'పదిలం' మృతి


పదిలం వెంకటేశ్వరరావు

నల్లజర్ల: వైఎస్సార్ సీపీ నాయకుడు, చీపురుగూడెం మాజీ సర్పంచ్ పదిలం వెంకటేశ్వరరావు (64) మంగళవారం తెల్లవారు ఝామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మరణవార్త తెలియగానే ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రకాశరావుపాలెంలో నిర్వహించాల్సిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిలుపుదల చేసి పదిలం పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయనతో పాటు పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, బంక అప్పారావు, ముప్పిడి వెంకటరత్నం, గోతం కృష్ణా యాదవ్, గాలింకి రాంబాబు, రాచగర్ల రామారావు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

ఆకాష్ టాలెంట్ టెస్ట్ చాంపియన్‌గా ఒబిడ్



నల్లజర్ల: జాతీయస్థాయిలో నిర్వహించిన ఆకాష్ టాలెంట్ టెస్ట్‌లో పోతవరం జెడ్పీ హైస్కూల్ టెన్త్ విద్యార్థి గంటా ఒబిడ్ చాంపియన్‌గా నిలిచాడని ఆ స్కూల్ హెచ్‌ఎం బి.దుర్గాసరస్వతి మంగళవారం తెలిపారు. ఇకపై ఆ విద్యార్థి ఉన్నత చదువుకు అయ్యే ఖర్చులో 30 శాతం రాయితీ అందించేలా విధంగా ఆ సంస్థ సర్టిఫికెట్ అందజేసినట్టు చెప్పారు.

తిరుగుడుమెట్టలో ఉచిత కంటి పరీక్షలు

తాళ్లపూడి: మండలంలోని తిరుగుడుమెట్ట గ్రామంలో మంగళవారం సుమారు 120 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ రాజేశ్వరి లయన్స్ నేత్ర వైద్యశాల డాక్టర్లు రోగులకు కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వల్లభశెట్టి చిన్ని, వై.బ్రహ్మానందం, పి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

43 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు

ఉండ్రాజవరం: ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్‌లో భాగంగా ఉండ్రాజవరం పీహెచ్‌సీలో మంగళవారం 43 మంది గర్భిణులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. గైనకాలజిస్టు అయేషా బేగం వారికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆ పీహెచ్‌సీ వైద్యుడు ఆర్‌ఎస్‌ఎస్‌వీ ప్రసాద్, ఎంపీహెచ్ ఎస్ కె. సుభాషిణి, స్టాఫ్ నర్సులు కుమారి, సంధ్య, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ : ఐఎన్‌టీయూసీ ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ఉండ్రాజవరం పీహెచ్‌సీలో డాక్టర్ రాజనాల ప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుబ్రహ్మణ్యం, యూడీసీ నారాయణ రెడ్డి, ఎస్.కుమారి, ఫార్మసిస్ట్ శ్రీదేవి, హెల్త్ అసిస్టెంట్ రమేష్, పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు కాపా నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

దేవరపల్లి: గుండుగొలను-కొవ్వూరు జాతీయ రహదారిపై మండలంలోని కృష్ణంపాలెం వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో మంగళగిరికి చెందిన లారీ డ్రైవర్ సొలసా శ్రీనివాసరావు (48) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం ఏపీ-39 టీఎఫ్1787 నంబర్ గల లారీ ఐరన్ లోడుతో వెళుతూ రాత్రి 11 గంటల సమయంలో ముందు వెళుతున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐరన్ ఊసలు క్యాబిన్‌లోని దూసుకు వెళ్లి డ్రైవర్ శ్రీనివాసరావు శరీరంలోకి దిగాయి. శ్రీనివాసరావు క్యాబిన్‌లో ఇరుక్కుని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు.

టీచర్లూ భాగస్వాములు కావాలి

గోపాలపురం: పాఠశాల అభివృద్ధిలో విద్యాకమిటీలతో పాటు టీచరూ భాగస్వాములు కావాలని ఎంఈఓ జి. శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పాఠశాలల హెచ్‌ఎంలతో స్థానిక విద్యావనరుల కేంద్రం వద్ద మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 'నాడు -నేడు'లో పూర్తయిన పాఠశాలల భవనాలను తక్షణమే వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. విద్యా కమిటీ చైర్మన్, సభ్యులతో సమావేశాలు నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.

దాతల అండతో ప్రభుత్వ స్కూళ్లు మరింత వృద్ధి

- హోం మంత్రి తానేటి వనిత
- ఊనగట్ల జెడ్పీ హైస్కూల్లో భోజనశాల భవనం ప్రారంభం
- రూ.10 లక్షల ఖర్చుతో పూర్వ విద్యార్థి నిర్మాణం


హైస్కూల్లో భోజనశాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తానేటి వనిత

చాగల్లు: ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవరచుకోవాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. దాతల సహకారంతో మండలంలోని ఊనగట్ల జెడ్పీ హైస్కూల్లో నిర్మించిన భోజనశాలను మంగళవారం ఆమె ప్రారంభించారు. పాఠశాల పూర్వ విద్యార్థి, భారత్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ నల్లాకుల బ్రహ్మానందం రూ.10 లక్షల వ్యయంతో విద్యార్థులకు ఈ భోజనశాల నిర్మించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి వనిత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు దాతలు స్థలాలు, భవనాలు నిర్మించి విద్యాభివృద్ధికి తోడ్పడడం అభినందనీయమన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వంతో పాటు దాతలు కూడా సహకరిస్తే ప్రభుత్వ విద్యాసంస్థలు మరింతగా అభివృద్ధి చెందుతాయన్నారు. ఊనగట్ల జెడ్పీ హైస్కూల్లో అదనంగా ఐదు తరగతి గదుల భవనాన్ని నిర్మిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా భోజనశాల నిర్మించిన దాత బ్రహ్మానందాన్ని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, సొసైటీ అధ్యక్షుడు ఆత్కూరి దొరయ్య, ఆత్మ చైర్మన్ గండ్రోతు సురేంద్రకుమార్, ఎంపీటీసీ సభ్యుడు ఆత్కూరి గోపీచంద్, స్థానిక నాయకులు గూడపాటి సుబ్బారావు, ప్రగళ్లపాటి సుబ్బారావు, నందిగం శ్రీనివాస్, హెచ్‌ఎం టీఎస్ రామానుజం పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీపర్వతంపై శ్రీమన్నారాయణ యజ్ఞం

- 17న వేంకటేశ్వరస్వామి కల్యాణం
- చురుగ్గా ఏర్పాట్లు



దేవరపల్లి: ఈ నెల 12 నుంచి 17 వరకూ మండలంలోని గౌరీపట్నం శ్రీపర్వతంపై కొలువైన వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం, శ్రీమన్నారాయణ యజ్ఞం జరగనున్నాయి. ఈ వేడుకలకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఆ వివరాలను దేవస్థానం ప్రధానార్చకుడు అవసరాల వెంకట రామానుజాచార్యులు మంగళవారం వివరించారు. గురువారం నుంచి రోజు ఉదయం, సాయంత్రం సామూహిక విష్ణు సహస్ర నామం, నారాయణ మంత్ర జపం, హోమాలు జరుగుతాయి. 12వ తేదీ సాయంత్రం అంకురార్పణ, మంటపారాధన, అగ్నిహోత్రం, శ్రీవారికి పూలంగి సేవ నిర్వహిస్తారు.13న గురుపూజ, విష్ణు సహస్రనామ స్తోత్రం, వేంకటేశ్వరస్వామి వారికి విశేష అభిషేకం జరుగుతాయి. 14న భోగి పండగ, గోదా రంగనాథుల కల్యాణం, స్వామి వారికి శేషవాహన సేవ నిర్వహిస్తారు. 15న నవగ్రహ శాంతి హోమం, జపం, సూర్యప్రభ వాహన సేవ, స్వామివారికి బంగారు పుష్పాలతో పూ, చంద్రప్రభ వాహన సేవ, విశేష పుష్పాలంకరణ సేవ జరుగుతాయి. 16న విశేష అలంకరణ సేవ, గరుడవాహన సేవ, వేద పఠనం, హోమాలు, వార్షిక సమావేశం నిర్వహిస్తారు. 17 ఉదయం పూర్ణాహుతి, అన్న సమారాధన, సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవం జరుగుతాయి. అనంతరం ప్రసాద వినియోగం, రుత్విక్కులకు దక్షిణ తాంబూలాల సమర్పణ, సత్కారం జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యార్థినులకు ముగ్గుల పోటీలు

కొవ్వూరు: సంక్రాంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళా సాధికార కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంస్కృతీ, సంప్రదాయాలు ప్రతిబింబించేలా విద్యార్థినులు వేసిన వివిధ రకాల ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ జె.సునీత విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.వైస్ ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమెషీన్లు


కుట్టుమెషీన్లు పొందిన మహిళలతో మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, రోటరీ ప్రతినిధులు

నిడదవోలు: రోటరీ సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. రోటరీ క్లబ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో 30 కుట్టు మెషీన్లను పేద మహిళలకు అందజేశారు. పట్టణంలోని రోటరీ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి మహ్మద్ ఫయాజ్, సభ్యులు కామిశెట్టి సత్యనారాయణ, గాజుల రంగారావు, కీర్తి ఆంజనేయులు, పోలదాసు శ్రీనివాస్, కొత్తపల్లి నాగేశ్వరరావు, దేవిశెట్టి వీరభద్రరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, ఆకుల ముకుందరావు, మీసాల ప్రసాద్, యామన గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

స్ప్రింగ్ బోర్డు ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో స్థానిక టౌన్ హాల్లో మంగళవారం రాత్రి సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన రంగవల్లుల పోటీల విజేతలైన విమల, లక్ష్మి, శ్రీలక్ష్మిలతో పాటు పోటీల్లో పాల్గొన్న మహిళలకు చైర్మన్ ఆదినారాయణ బహుమతులు, మెమెంటోలు అందజేశారు. చిన్నారులు, వారి తల్లిదండ్రులు చేసిన సంక్రాంతి నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, పడాల శిరీష, ఆలమూరి భారతి, స్ప్రింగ్ బోర్డు స్కూల్ కరస్పాండెంట్ కంఠమని గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫేస్ యాప్ రద్దుకు అంగన్‌వాడీల డిమాండ్

కొవ్వూరు: అంగన్‌వాడీలకు ఫేస్ యాప్ రద్దు చేయాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ధర్నా చేశారు.ప్రాజెక్టు పరిధిలోని కార్యకర్తలు, ఆయాల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్‌కు అందజేశారు.అంతకు ముందు వారు మొయిన్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు.అంగన్‌వాడీ కేంద్రాలను సచివాలయాల పర్యవేక్షణలో ఉంచాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ, ప్రతినిధులు సీహెచ్ పుష్పావతి, వి.శ్రీదేవి, ఎ.దుర్గామణి, పి.చిన్న బ్రహ్మమ్మ, సి.తులసీరత్నం, కె.సునీత, జి.మంజుల తదితరులు నాయకత్వం వహించారు.

తాళ్లపూడి: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం వారు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ టి. రాధికకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ సభ్యులు భాస్కరం, ఆర్.జ్యోతి, ఐ.రమణ, సుజాత, పెర్సి సుందరి, దయామణి తదితరులు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్ల కనీస వేతనం పెంచాలని, ఫేషియల్ యాప్ రద్దు చేయాలని కోరారు. హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

జీవో రద్దు చేయాలంటూ నిరసన

కొవ్వూరు: రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను హరించే జీవో నంబర్-1ని రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బస్టాండ్ సెంటర్లో మంగళవారం జీవో కాపీలను దగ్ధం చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన కూడా ఓ హక్కు అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు అన్నారు. సీఐటీయూ కొవ్వూరు కమిటీ అధ్యక్షుడు మద్దుకూరి దొరయ్య, రాచూరి రాము, సువర్ణ గణేష్, జాస్తి శివరామకృష్ణ, తిరుమల గణపతి, చోడవరపు బంగారునాయుడు పాల్గొన్నారు.

వైజ్ ఇంజినీరింగ్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు


వైజ్ కళాశాల ఆవరణలో భోగి మంట వద్ద విద్యార్థుల సందడి

నల్లజర్ల: ఈనెల 12 నుంచి విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో విద్యాలయాల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్నారు. మండలంలోని ప్రకాశరావుపాలెం వైజ్ ఇంజినీరింగ్ కళాశాలల్లో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పల్లెటూరు వాతావరణాన్ని తలపించేలా క్యాంపస్‌లో విద్యార్థినులు రంగవల్లులను తీర్చిదిద్దారు. హరిదాసులు, గంగిరెద్దులు, బొమ్మరిల్లులను ప్రదర్శించారు.గాలిపటాల పోటీలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినీవిద్యార్థులు సందడి చేశారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆకుల త్రిమూర్తులు, ప్రిన్సిపాల్ డాక్టరు అరవిందకుమార్, ఏఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమరానికి 'సై'


దేవరపల్లిలో నిర్వహిస్తున్న కోడి పందేలు (ఫైల్)

- కోడి పందేలకు సిద్ధమవుతున్న బరులు
- పోలీసు హెచ్చరికలను లైట్ తీసుకుంటున్న నిర్వాహకులు

దేవరపల్లి: సంక్రాంతి సందర్భంగా కోడిపందేల నిర్వహణకు పల్లెల్లో బరులు సిద్ధమవుతున్నాయి. అధికారులు, పోలీసుల నామమాత్రపు హెచ్చరికల ను పందేల నిర్వాహకులు బేఖాతరు చేస్తున్నారు. ఏటా ఇలాంటి హెచ్చరికలు మామూలే అని పందేల రాయుళ్లు అంటున్నారు. కాగా పందేల నిర్వాహకు లు అధికారుల నుంచి అనధికారికంగా అనుమతు లు పొందిన తర్వాతే రెండు రోజులుగా గ్రామాల్లో చడీచప్పుడు లేకుండా బరులను సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. ఒక ప్రక్క పోలీసులు, రెవెన్యూ అధికారులు సంక్రాంతి పేరుతో కోడి పందేలు, గుండాట లు, జూదాల వంటివి నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్య లు తీసుకుని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తూ, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. మరోపక్క పందేల నిర్వాహకులు మాత్రం తమ పని తాము చేసుకుంటూ పోతున్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా తగ్గేదేలే అంటున్నారు పందేల నిర్వాహకులు. గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలా ల్లో దాదాపు 30 గ్రామాల్లో ఏటా కోడి పందేలు నిర్వహిస్తున్నారు. పందేల నిర్వాహకులు, కోడికత్తుల తయారీదారులు, వాటిని కట్టే వారిపై పోలీస్ స్టేషన్ల లో బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారు. దేవరపల్లి పోలీస్ స్టేషన్లో ఇప్పటి వరకూ 45 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు ఎస్సై కె. శ్రీహరిరావు తెలిపారు.

దాళ్వా వరి నాట్లు 80 శాతం పూర్తి


చివటంలో వరి నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

ఉండ్రాజవరం: మండలంలో దాళ్వా సాగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. చివటం, పసలపూడి, వడ్లూరు, వేలివెన్ను తదితర గ్రామాల్లో ముందుగానే వరి నాట్లను ప్రారంభించారు. ఈ రబీలో మండలంలో 11,500 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేస్తున్నారు. ఇప్పటికే 80 శాతం వరి నాట్లు పూర్తయ్యాయి. మిగిలిన 20 శాతం నాట్లను సంక్రాంతి లోగా పూర్తి చేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. పంట చివరి దశలో నీటి ఎద్దడి రాకుండా ముందుగానే దాళ్వా సాగుకు సిద్ధమయ్యామని పలువురు రైతులు చెప్పారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రబీ సాగు పనులు వేగంగా సాగుతున్నాయని వారు సంతోషంగా తెలిపారు. ఎక్కువ మంది రైతులు బెంగాల్ నుంచి వచ్చిన కూలీలతో నాట్లు వేయిస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ అజెండా

- హోం మంత్రి తానేటి వనిత
- ఊనగట్లలో గడప గడపకూ..


ఊనగట్లలో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి తానేటి వనిత


ప్రకాశరావుపాలెంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

చాగల్లు: అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగుతోందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. ఊనగట్ల గ్రామంలో మంగళవారం ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ఆమె ప్రజలకు వివరించారు. గ్రామస్తుల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ అవినీతి, లంచాలకు ఆస్కారం లేకుండా ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. భవిష్యత్తులో జగనన్నను మరోసారి సీఎంగా గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె గ్రామస్తుల సమస్యలు తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్ష, గౌరవాధ్యక్షులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, జుట్టా కొండలరావు, సొసైటీ అధ్యక్షులు ఆత్కూరి దొరయ్య, లకంసాని రామకృష్ణ, ఊనగట్ల సర్పంచ్ మట్టా వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యుడు ఆత్కూరి గోపీచంద్, ఉప సర్పంచ్ కొయ్యలమూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమం .. అదే మాధ్యేయం

నల్లజర్ల: ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించడం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని ప్రకాశరావుపాలెంలో మంగళవారం మూడో రోజు కూడా ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఒకే ప్రాంగణంలో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా, వెల్‌నెస్ సెంటర్ నూతన భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. పంచాయతీ సర్పంచ్ జాన్‌విక్టర్, కరుటూరి లక్ష్మీగణేశ్వరరావు, ముత్తిన నాని, నరేష్, కరుటూరి అచ్యుతరామయ్య, మట్టా లక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అమ్మఒడి, వైఎస్సార్ పింఛను, ఆసరా, జగనన్న చేయూత, రైతుభరోసా వంటి పథకాలన్నీ జగన్ సీఎం అయ్యాకే తమకు అందుతున్నాయని, ఆయనకు అండగా నిలబడి రుణం తీర్చుకుంటామంటూ లబ్ధిదారులు సంతోషం వ్యక్తంచేశారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు మనమంతా కంకణబద్ధులం కావాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు కోరారు. కార్యక్రమంలో ధూళిపాళ వెంకన్న, తంగెళ్ళ రాంబాబు, గోగులమండ బాబ్జీ, కంచర్ల నాగలింగం, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, నాయకులు బంక అప్పారావు, ముప్పిడి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

జూదాల జోలికి పోవద్దు

కొవ్వూరు: సంక్రాంతి పేరుతో కోడి పందేలు, పేకాట, కోతాట వంటి జూదాలకు దూరంగా ఉంటూ సంప్రదాయ క్రీడలు, ఆటల పోటీలు నిర్వహించుకోవాలని రూరల్ ఎస్సై జి.సతీష్ సూచించారు. మండలంలోని సీతంపేట, తోగుమ్మి, మద్దూరు, మద్దూరులంక గ్రామాల్లో మంగళవారం పోలీసు, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ పి.నాగరాజు నాయక్, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సహకార శాఖ డైరీ ఆవిష్కరణ

కొవ్వూరు: సహకార శాఖ-2023 డైరీని కొవ్వూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత మంగళవారం ఆవిష్కరించారు. జిల్లా సహకార ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీవీహెచ్ రవిశంకర్, మలపకపల్లి సొసైటీ అధ్యక్షుడు కుంటముక్కల కేశవ నారాయణ, వైఎస్సార్ సీపీ మండల గౌరవాధ్యక్షుడు గన్నమని వెంకట్రాజు (రాజు), వల్లభశెట్టి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ క్యాలెండర్ ఆవిష్కరణ

దేవరపల్లి: జనసేన పార్టీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండలంలోని లక్ష్మీపురంలో మంగళవారం ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు డి.సువర్ణరాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పోలుమాటి నానిబాబు, చప్పటి శివ నాగప్రసాద్, కంభాల సత్తిబాబు, ఎం.సతీష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ


కంసాలిపాలెంలో ట్యాబ్‌లు పొందిన విద్యార్థులతో సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు

నిడదవోలు రూరల్: మండలంలోని కంసాలిపాలెం ప్రాథమికోన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు మంగళవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. సర్పంచ్ కొండపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా వాటిని విద్యార్థులకు అందజేశారు. అనంతరం శ్రీనివాస్ పాఠశాల్లో మధ్యాహ్న భోజనం తయారీని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మలిశెట్టి వీరప్రసాద్, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు బెజవాడ గంగాధరం, సచివాలయ కన్వీనర్ ఉప్పాటి కుమారి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రాపోలు నాగభూషణం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మానవత సంస్థ ఆర్థిక సాయం

తాళ్లపూడి: మృతుడి కుటుంబానికి మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆర్థిక సాయం చేసింది. తాళ్లపూడికి చెందిన ఊబా ఏసురత్నం ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈక్రమంలో మానవత సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో ఆయన కుటుంబ సభ్యులకు మంగళవారం రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో ఈ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు జె.వెంకటేశ్వరరావు, సభ్యులు సాయన సుబ్బారావు, వి.చంద్రయ్య, అప్పన చంద్రగుప్త, సనపల రాజశేఖర్, పరస రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం ప్రారంభం

గోపాలపురం: దశాబ్ద కాలంగా అధ్వానంగా ఉన్న గోపాలపురంలోని ఇందిరమ్మ కాలనీ రోడ్డుకు మహర్దశ పట్టనుంది. ఈ గ్రామంలో గడప గడపకూ కార్యక్రమం నిర్వహించినపుడు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ కాలనీలో మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ పనులను గోపాలపురం సొసైటీ చైర్మన్ కూసం రామమోహన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ మాజీ కన్వీనర్ ఎస్‌కే వల్లీ, పార్టీ నాయకుడు వింజమూరి సుబ్బారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ముల్లంగి శ్యామ్‌సుందర్‌రెడ్డి, పంచాయతీ సర్పంచ్ పైడి శిరీష తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పీఆర్ ఉద్యోగుల సంఘం

గోపాలపురం: సమస్యల పరిష్కారానికి పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘాన్ని ఏర్పాటు చేసినట్టు ఆ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు గున్నూరు శ్రీధర్‌రాజు అన్నారు. సంఘ సభ్యులతో మంగళవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రాజు మాట్లాడుతూ సంఘ సభ్యుల సమస్యలను ఎప్పటి కప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా సంఘ నూతన కౌన్సిలర్లుగా గోపాలపురం మండలం చిట్యాల జెడ్పీ హైస్కూల్ జూనియర్ అసిస్టెంట్ ఎస్. మురళి, దేవరపల్లి మండలం యర్నగూడెం రికార్డ్ అసిస్టెంట్ గంగుల శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ గెల్లా రాజమనోహర్, కార్యదర్శి జి పతంజలి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

చాగల్లు: బాలింతల సంరక్షణ, పిల్లల పౌష్టికాహారం, ఆరోగ్యం సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై స్థానికఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయకుమారి మాట్లాడుతూ గర్భిణులు ఎనిమిక్ బారిన పడకుండా, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహార, రక్తహీనత లోపం రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ప్రీ ప్రెగ్నెన్సీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో ఎం.ఆశారోహిణి, సూపర్‌వైజర్ వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.